1996 జూలై 6వ తేది సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

# సర్వవిధములైన సాధనలకు ప్రేమ ప్రాణసమానమైనది

**సాధనలు చేసి ఫలమేమి శమములేక**
**యోగమును పూని ఫలమేమి ఓర్పులేక**
**జపము చేసియు ఫలమేమి శాంతి లేక**
**చవిటి భూమిని దున్నిన చాయకాదె**

విద్యార్థులారా!

'సాధనమున పనులు సమకూరు ధరలోన'. ప్రపంచములో ఏరంగము నందైనా విజయమును సాధించవలెనన్న దానికి సంబంధించిన కొన్ని సాధనలు సల్పియే తీరాలి. చీమైనా నడచుటకు ప్రయత్నించిన కొన్ని మైళ్లు ప్రయాణము చేయగలదు. ఎగురుటకై ఇష్టము లేకుండిన గరుడ కూడా రెండడుగులు ముందుకు నడవలేదు. ప్రతిమానవుడు సంకల్పము లేక, సంకల్పమునకు తగిన సాధన లేక ఏ చిన్నకార్యము సాధించలేడు. ధ్రువుడు లేతవయస్సునందే దైవమును సాక్షాత్కరింప చేసుకోవాలని సత్సంకల్పము కలిగిన తక్షణమే ఎట్టి బాధలకు ఎట్టి కష్టములకు, ఎట్టి విచారములకు ఏమాత్రము వెరువక సాధనలు సల్పి ధైర్యముతో, సాహసముతో విజయాన్ని సాధించాడు. ఆ సత్సంకల్పముయొక్క పటుత్వముచే తాను ధ్రువతారగా మారాడు. అదే విధముగా ప్రతి మానవుడు వయస్సుగానీ, శక్తి సామర్థ్యములుగానీ, ఏమాత్రము విచారించక దృఢ విశ్వాసముతో సాధనసల్పిన ఆ కార్యము సఫలీకృతము కాగలదు.

ఎంతమంది చరిత్రలో మీరు విని ఉంటారు. గొప్పగొప్ప మహనీయులు కూడా అనేక తపస్సులాచరించి కడపటికి ఆ తపస్సుయొక్క శక్తిని కోల్పోయి నిరాశకు, నిస్పృహకు గురౌతూ వచ్చారు. విశ్వామిత్రుడు అనేక పర్యాయములు తపస్సాచరించి కడపటికి ఓరిమి లేకపోవటంచేత,

sri sathyasaivachanamrutam

శమము లేకపోవటంచేత, తన తపఃశక్తి కోల్పోయి తిరిగి తపస్సుకు వెళ్ళటానికి ప్రయత్నిస్తూ వచ్చాడు. ప్రతి రంగమున సాధన అత్యవసరము.

**అనగనగ రాగమతిశయిల్లుచునుండు**
**తినగ తినగ వేము తీయనుండు**

ఈ భజనలు పాడే విద్యార్థులు ఎంతో ప్రయత్నము చేసి, ఎన్నో విధముల సాధనల చేత ఈనాడు సుస్వరముతో పాడగలుగుతున్నారు. దుర్వాసుడు మహాశక్తి సంపన్నుడు, మహా తపస్సంపన్నుడు. కానీ, అతనియందు శమము దుర్భిణీ పెట్టి చూచినా కనిపించదు. అతనికి అతికోపము. శాంతి అతనిలో కానరాదు. కనుక అతని పేరుకు ఏమాత్రము కీర్తిప్రతిష్ఠలు లేకపోయినవి. కారణము, శాంతి లేకపోవటమే! ఎంత తపస్సు చేసినా, ఎంత శక్తి సంపాదించినా శాంతి లేక సర్వము తాను కోల్పోతాడు. శాంతితోబాటు క్షమ అత్యవసరము.

**క్షమ సత్యము క్షమ ధర్మము క్షమ వేదము క్షమ అహింస**
**క్షమ సంతోషము క్షమ దయ క్షమ సర్వస్వము సర్వలోకములందు**

క్షమ, ప్రతి మానవునకు ప్రధాన నేత్రము. సర్వవిధములైన సాధనలకు ప్రేమ ప్రధానమైన ప్రాణము. ఈ ప్రేమలేక జీవితమే లేదు. ఈ ప్రేమతత్వాన్ని చక్కగా గుర్తించి, వర్తించటానికి ప్రయత్నించాలి.

**ప్రేమయే పరమాత్మ స్వరూపము**

Life is a dream, realise it. ఏది dream? Life అంతా dream. పగటి వేళయందు మీరందరు కూర్చొని స్వామి సందేశము శ్రవణము చేస్తున్నారు. ఇది dream కాదా! కన్నులతో చూస్తున్నారు. చెవులతో వింటున్నారు. హృదయము కదలింపచేసుకుంటున్నారు. ఈ మార్పులు, కూర్పులు ప్రత్యక్ష ప్రమాణములేయని మీరు భావిస్తున్నారు. ఎంతవరకు ఇది ప్రత్యక్ష ప్రమాణము? రాత్రి పండుకున్న తరువాత ప్రత్యక్షమంతా పరోక్షమైపోతుంది. ఆ స్వప్నములో ఆనందము దుఃఖము రెండు సంభవిస్తూ ఉంటాయి.

sri sathyasai vachanamrutam

కానీ దుఃఖములు, ఆనందములు ఎంతవరకు ఉంటాయి? కల ఉన్నంతవరకే! తిరిగి జాగ్రదవస్థకు వచ్చిన తక్షణమే అంతా అసత్యముగా రూపొందుతుంది. పగటివేళ రాత్రి కలలు లేవు. రాత్రి నిద్రయందు ఈ పగటి కలల అనుభూతులు ఏమాత్రము స్మరణకు రావు. కాబట్టి ఇది పగటి కల, అది రాత్రి కల. ఈ పగటి కలలో రాత్రి కల లేదు. రాత్రి కలలో పగటి కల లేదు. కానీ పగటి కలలోనూ, రాత్రి కలలోనూ నీవు ఉన్నావు. కనుక నీవు omnipresent. రాత్రింబవళ్ళు రెండూ కలలైనప్పుడు life is a dream. కనుక realise చేయాలి. అదే religion. Religion అనగా realisation. ఏది సత్యమని గుర్తించటమే religion. అన్నింటికి ప్రేమయే ప్రధానము. కఠినమైన అడవులందు, కౄరమైన మృగములు సంచరించే కారడవులందు అనేకమంది ఋషులంతా తపస్సు చేస్తూ కాలము గడుపుతూ వచ్చారు. అనేక విధములైన కౄర మృగములు సంచరిస్తున్నాయి. ఋషుల దగ్గర తుపాకులుగానీ, కత్తులుగానీ మరే యితర ఆయుధములు లేవు. కానీ ఈ ఋషులు, ఆ మృగములు సమముగానే జీవిస్తూ వచ్చాయి అడవిలో. కౄర మృగములను జూచి ఋషులు భయపడలేదు. ఋషులను జూచి మృగములు భయపడలేదు. కారణము ఏమిటి? ఋషులందు పరిపూర్ణప్రేమ ఉండటంచేతనే! ప్రేమప్రభావమే కౄర మృగములందు సంచరించి కౄరమృగములుకూడా ప్రేమ స్వరూపము ధరించాయి. కాబట్టి ఎట్టి సంగమో అట్టి ప్రభావము ఆవిర్భవిస్తుంది. మనము మంచివారితో సహవాసము చేసినప్పుడు మన గుణములు కూడా మంచివిగానే ఉంటాయి. అన్నింటికి ప్రేమయే ప్రధానము. ప్రేమయే పరమాత్మ స్వరూపము. ఈ ప్రేమ యందే మనం జీవించాలి.

**మానవుడు ఏపని చేసినా భగవంతుని సంతృప్తికోసం చేయాలి**

ఇటలీలో గొప్ప వయోలినిస్టు ఆంథోని ఉండేవాడు. ఈ ఆంథోని వయోలిన్ అంటే గొప్ప పేరు. ఒక వయోలిన్ తయారు చేయుటకు ఒక సంవత్సరము తీసుకొనేవాడు. అతని స్నేహితుడు వచ్చి 'ఆంథోనీ! నీవు కుటుంబీకుడవు. ఒక సంవత్సరమునకు ఒక వయోలిన్ తయారుచేస్తే దానివలన వచ్చే ఆదాయము ఏమిటి? నీ కుటుంబమును ఏరీతిగా సంరక్షించుకోగలవు? ఏరీతిగా శాంతిగా జీవించగలవు?" అని అడిగాడు. అప్పుడు ఆంథోని చెప్పాడు: 'ఓ స్నేహితుడా! పరమాత్ముడు పూర్ణ స్వరూపుడు. పరిపూర్ణ స్వరూపుడు కనుక

sri sathyasai vachanamrutam

మానవుడు చేసే చిన్న కార్యము కూడా పరిపూర్ణముగానే ఉంటుండాలి. అప్పుడే పరిపూర్ణ పరమాత్మకు సంతృప్తి కలుగుతుంది. నా కుటుంబ సంక్షేమము కోసం నేను ఈ వయొలిన్ చేయటంలేదు నా జీవిత ఆనందనిమిత్తమై ఈ వయొలిన్ చేయటం లేదు. పరిపూర్ణుడైన పరమాత్మ తృప్తికై నేను ఈ వయొలిన్ చేస్తున్నాను' అన్నాడు. ఏ మానవుడు ఏపనిచేసినా భగవంతుని సంతృప్తి కోసం చేయాలి. దీనిని పురస్కరించుకొనియే వేదము సర్వకర్మ భగవత్ప్రీత్యర్థము అనింది. మనము శాంతిలేక ఎన్ని సాధనలు చేసినా నిరుపయోగమైపోతుంది. ఓర్పులేక మనము ఎన్ని యోగములు చేసినా శరీరశ్రమలకు గురౌతాము గానీ ఆత్మశాంతి ఏమాత్రము అందుకోలేము. సంతృప్తిలేక, శాంతి లేక, ఎంత జపము చేసినా కృత్రిమమైన జపముగా రూపొందుతుంది గానీ దైవప్రీతిగా రూపొందదు. మనము చేసేవన్నీ భగవత్ప్రీత్యర్థము చేయాలి. ఏ చిన్నది చేసినా చాలు. భగవంతుడు ఎప్పుడూ క్వాలిటీ చూస్తాడుగానీ క్వాంటిటీ చూడడు.

**గంగిగోవుపాలు గరిటెడైనను చాలు**
**కడివెడైన నేమి ఖరముపాలు**

ఎంతో గొప్ప సాధన చేస్తున్నాము. ఒక గంట సాధన ధ్యానము చేశాము. గంటసేపు కూర్చున్నావేగానీ ఎంతసేపు మనసు నిల్చింది. ఒక్కక్షణమైనా మనసు నిల్వలేదు. ఈవిధంగా గంటలు వ్యర్థము చేస్తున్నావు.

**హృదయమును పరిశుద్ధమైన స్ఫటికముగా ఉంచుకోవాలి**

నీవు చేసే ప్రతి కార్యము భగవత్కార్యముగా భావించు. ఇదే సరైన, సులభమైన, సున్నితమైన మార్గము. ఈ మార్గము వదలి ఎందులకీ శ్రమలకంతా గురికావాలి. నీ ఇంట పనులు కూడా భగవత్కర్మలుగా భావించు. భగవంతుడు నీహృదయవాసి దేహముతో ఏకార్యములు చేసినా తన ద్వారానే జరుగుతున్నది. చూచే కన్నులు తన ద్వారానే చూడగలుగుతున్నవి. చెవులు కేవలం లౌడ్ స్పీకర్లు మాదిరి కనిపిస్తున్నాయిగానీ ఆ చెవులలోనున్న శక్తి దైవముయొక్క శక్తియే. మన ఇంద్రియములన్నీ దైవసంబంధమైన కర్మేంద్రియములే. ఏ ఇంద్రియములతో చేసినా భగవత్ప్రీత్యర్థము చేసినట్లుగా భావించాలి. ఎవరి తృప్తికోసం నీవు

చేస్తున్నావని విచారణ చేస్తే ఇది తన తృప్తికోసమే. తాను అంటే ఎవరు? దేహమా తాను? దేహమే తానైతే 'నాదేహము' అని ఎందుకనాలి. నీవే మనస్సు అయితే 'నామనస్సు' అని ఎందుకనాలి? ఈ 'నా' ఎవరు? You are not the body. You are not the mind. You are the master. mind, body, senses are instruments. ఈ పనిముట్లచే చైతన్య స్వరూపుడైన భగవంతుడే చేయిస్తున్నాడు. అందరియందు ఈ చైతన్య స్వరూపమే ఇమిడిఉంది. ఈ చైతన్యము లేక ఏ ప్రాణి కూడా ఏవ్యక్తి కూడా జగత్తులో ఉండటానికి వీలుకాదు. సర్వులయందు చైతన్య స్వరూపుడైన ఈశ్వరుడున్నాడు. జగత్తంతా దైవస్వరూపమే. భగవంతుడు అందరియందు ఉంటున్నాడు. అయితే ఎందుకు కనిపించకూడదు? పిల్లలు మీకందరికి తెలుసు. అనేక రకములైన జపమాలలుంటున్నాయి తులసిమాల, రుద్రాక్షమాల, lotus seeds మాల, స్ఫటిక జపమాల లుంటాయి. అన్నింటియందు ఒకే దారము ఉంటున్నది. రుద్రాక్షమాలలోని దారము మనకు కనిపించదు. Lotus seeds మాలలోని దారము మనకు కనిపించదు. తులసిమాలలోని దారము మనకు కనిపించదు. కానీ స్ఫటిక మాలలోని దారమే మనకు కనిపిస్తుంది. అందరు మానవాకారులే! కానీ అందులో ఎవరు పరిశుద్ధమైన స్ఫటికముగా ఉంటున్నారో వారి హృదయమందు మాత్రమే బ్రహ్మ అనే సూత్రము కనిపిస్తుంది. సర్వులలో ఉండినది బ్రహ్మసూత్రమే. సూత్రమనగా దారము. ఆ బ్రహ్మ అనే దారము సర్వులయందు చేరి ఉంటున్నది. మనము చూడాలనుకున్నప్పుడు మన హృదయమును స్ఫటికముగా పెట్టుకోవాలి. పరిశుద్ధమైన స్ఫటికముగా ఉండినప్పుడే బ్రహ్మతత్వము గుర్తింపచేయటానికి వీలవుతుంది.

**కామ, క్రోధ, లోభములే మోక్షమునకు పరమశత్రువులు**

ఈనాటి మానవుడు జపములు చేస్తున్నాడు. ధ్యానము చేస్తున్నాడు. యోగమునకు కూర్చుంటున్నాడు. ఆసనములు వేస్తున్నాడు. ఎన్ని చేసి ప్రయోజనము ఏమిటి? మనయందున్న దురాలోచనలు, దుర్బుద్ధులు పోవాలి. మానవునకు ప్రధాన సూత్రమునందించేది రామాయణము, భాగవతము, భారతము. రామాయణము, భాగవతము, భారతములను పండితులు ఏమని పిలుస్తూ వచ్చారు? కామ, క్రోధ, లోభములని పిలుస్తూ వచ్చారు.రామాయణము కామము. ఎమిటి ఇంత పవిత్రమైన చరిత్రను కామమని చెబుతున్నారని



sri sathyasaivachanamrutam

విచారించవచ్చు. విచిత్రమని అనిపించవచ్చు. రామాయణమునకు మూలకారణము రావణుని కామమే. రామాయణమంతా రావణుని దుర్గుణమే. కామము రామాయణములోని రావణుడే. సర్వశక్తులు ఉండిన రావణుడు స్వల్పమైన అభీష్టమునకు గురై తన రాజ్యమును, తన బంధువులను, తన సర్వస్వమును కోల్పోయాడు. క్రోధమనగా భాగవతము. హిరణ్యకశిపునకు, హిరణ్యాక్షునకు భగవంతునిపై కోపము. భగవంతునిపై క్రోధము పూనినాడు కనుక హిరణ్యకశిపుడు ఏమాత్రము ముందువెనుక విచక్షణా జ్ఞానము లేక సర్వము కోల్పోయాడు. భాగవతము హిరణ్యకశిపుని చరిత్ర. హిరణ్యకశిపుడు హరి అనగా మండి పోయేవాడు. కన్నకుమారుని దయా దాక్షిణ్యములు లేక హింసలు పెడుతూ వచ్చాడు. క్రోధము విచక్షణా జ్ఞానమును కోల్పోతుంది. కట్టకడపటికి ఏమైపోయాడు. అన్ని విధముల అపకీర్తులపాలైపోయి భ్రష్టుడైపోయాడు. పంచభూతములను హస్తగతము గావించుకున్నవాడు హిరణ్యకశిపుడు. ఎన్ని సంపాయించి ఏమి ప్రయోజనం? ఏమాత్రము విజయాన్ని సాధించలేకపోయాడు. ఇంక లోభము. దురాశతో నిండిన దుర్యోధనుడు అన్ని విధముల అపజయము పొంది తన నూర్గురు సోదరులను కోల్పోయాడు. ధర్మమూర్తులైన పాండవులపైన, కృష్ణునిపై ద్వేషము పూనుతూ వచ్చారు. కృష్ణునిపై విశ్వాసముండినట్లు నటించాడు గానీ విశ్వాసము లేదు. కారణమేమిటి? పాండవుల పక్షం ఉంటున్నాడని. కృష్ణునిపై ద్వేషము పూనుతూ వచ్చాడు దుర్యోధనుడు. ముగ్గురు దైవద్వేషులే. కామ, క్రోధ, లోభములు మూడు దైవమునకు ద్వేషులే. పవిత్రమైన పరతత్వమునకు ద్వారములు నిరంతరము మూయబడిఉంటాయి. మోక్షమునకు పరమ శతృవులు ఈ మూడే. ఏమిటి ఈ మోక్షము. మోక్షమనగా మోహక్షయమే. మన మోహమును మనం తగ్గించుకుంటే అదే మనకు మోక్షం.

ఒకానొక సమయంలో నారదుడు విష్ణువును ప్రశ్నించాడు. స్వామీ! నేను నిరంతరము మీదర్శన నిమిత్తమై ఎక్కడుంటే అక్కడకు వస్తున్నాను. ఒక్కొక్క సమయంలో చాలా అవసరమైన పని ఏర్పడుతుంది. మిమ్మల్ని దర్శించాలను కుంటే మీ హెడ్డాఫీసు ఎక్కడ అని అడిగాడు. వైకుంఠమా, కైలాసమా, స్వర్గమా అని అడిగాడు. అప్పుడు విష్ణువు "నారదా! ఎడ్రసు వ్రాసుకో: మద్భక్తాః యత్రగాయన్తి తత్ర తిష్ఠామి నారద." వైకుంఠము, కైలాసము, స్వర్గము బ్రాంచి ఆఫీసులు. నా హెడ్డాఫీసు నా ప్రియమైన భక్తుడు ఎక్కడ నన్ను స్మరిస్తూ ఉంటాడో అక్కడ నేను

srisathyasaivachanamrutam

ప్రతిష్ఠ అయిఉంటాను. మిగిలిన స్థానములలో నేను ఉత్సవవిగ్రహమును! 'తిష్ఠామి' అన్నాడు, 'వసామి' అనలేదు.

**భగవంతుని పొందటానికి అత్యంత సులభమార్గము ప్రేమయే**

ప్రతి హృదయము భగవంతుని నివాసమే! 'నేను మానవుడను' అని భ్రమించకండి. అందరు దైవస్వరూపులే! పాంచభౌతికమైన దేహమును అనుసరించటం చేత, ఉపాధి భేదములచే మనము మానవులుగా భావిస్తున్నాము. ఈ ఉపాధి భేదములు విస్మరించండి. ఉన్న సత్యము గమనించండి. నిత్యసత్యమైన దైవమును స్మరించండి. కేవలము జీవితమంతా లౌకికమైన, భౌతికమైన, ప్రాకృతమైన దీనియందే కాలము గడపకండి. భగవంతుడు ఎప్పుడూ ప్రేమ స్వరూపుడే. అంతా తన యొక్క ప్రేమయే. స్వరూపము ఉంటే స్వభావము రావచ్చును. స్వరూపము లేదు. స్వభావము లేదు. ప్రేమయే తాను తానే ప్రేమ. ప్రేమకు రూపమే లేదు. ప్రేమ ప్రేమయే. కనుక ప్రేమకు పరిమితము లేదు. సముద్రమునకు పరిమితమున్నది. ఆకాశమునకైనా పరిమితమున్నది కానీ ప్రేమకు పరిమితములేదు. కర్నాటక దేశములో మల్లమ్మ అనే పరమ భక్తురాలుండేది. "ఓ పరమాత్మా! కొలనుకు తామరయే శృంగారము. కొలనులో తామర పుష్పమే లేక కొలనుకు శృంగారమే లేదు. గ్రామానికి ఇండ్లే శృంగారము. ఆకాశమునకు చంద్రుడే శృంగారము. సముద్రమునకు అలలే శృంగారము" అని వర్ణించింది. స్వామి భక్తులకు ప్రేమయే శృంగారము. ప్రేమను మించిన శృంగారము మరొకటిలేదు. అలలు లేని సముద్రము, చంద్రుడు లేని ఆకాశము, కమలము లేని కొలను ఏవిధంగా శృంగార రహితమైనవో ఆవిధంగా ప్రేమలేక జీవితమునకు శృంగారము లేదు. ప్రేమయే మనకు పెద్ద శృంగారము.

ప్రేమయే దైవము. అందరినీ ప్రేమించు. ప్రేమ ఎదుటివానిలో లేనప్పుడు నీ ప్రేమ వానికి పంచు. ఇదివరకే చెప్పాను, ప్రేమ దిక్సూచివంటిదని. అది ఎక్కడ పెట్టినా ఉత్తరదిక్కునే సూచిస్తుంది. అదేరీతిగా మనము ఏమి చేసినా, ఏమి చింతించినా, ఏమి కోరినా, ఏమి ఆలోచించినా అదంతా దైవమువైపునే పోవాలి. మనము వ్యాపారము చేసి, ఉద్యోగము చేసి ఏవిధముగా ధనము సంపాదిస్తున్నామో అదేవిధముగా మన నిత్యజీవితములో చేసే

sri sathyasai vachanamrutam

ప్రతికర్మయందు ప్రేమ ప్రతిఫలించాలి. ఈ ప్రేమ ఏవిధముగానూ తరిగేది కాదు. ఎప్పుడూ సమత్వంగానే ఉంటుంది. 'పూర్ణప్రేమయందె పుట్టును దైవంబు', పూర్ణప్రేమ ఎక్కడుంటుందో అక్కడే పుడతాడు భగవంతుడు. దైవమును పొందటం ఎంత సులభమో మీకు తెలియదు. చాలా సులభము. పుష్పముయొక్క రేకును నలపటానికి కష్టమవుతుందికానీ భగవంతుని పొందటము అంతకంటె సులభము. వెన్నను నలపటం కొంచెం కష్టంకానీ భగవంతుని చూడటం అంతకంటె సులభం. ఇంత సులభమైన మార్గమును మీరు ఎందుకు చూడటానికి ప్రయత్నించటం లేదు? కారణము మీ భావములే. "భగవంతుడు ఎక్కడో ఉంటున్నాడు. పొందటము చాలా కష్టము. తపస్సు చేయవలెనో ఏమిటో" – ఈ భావములే మిమ్మల్ని భ్రమింపచేస్తున్నాయి. భగవంతుడు ఎక్కడో లేడు. ఎక్కడ చూచినా ఉన్నాడు. ఎక్కడ చూచినా ఉన్నవానిని వెతకటము ఎందుకు? వెతకనక్కరలేదు. చూచేదంతా చర్మచక్షువులే. చర్మ చక్షువులంతా బాహ్య ప్రపంచమునే చూస్తున్నాయి. ఈ బాహ్యప్రపంచము భగవత్స్వరూపమే. చూస్తున్నదంతా భగవత్స్వరూపమే. ఈ శిరస్సులన్నీ విరాట్ స్వరూపమే. మీరు దృశ్య కల్పితమైన రూపనామములు పెట్టుకొని మనుష్యులుగా కనిపిస్తున్నారేగానీ నిజముగా ఈ సృష్టిని దైవముగా భావించండి. అదే దైవముగా మారిపోతుంది. నీ దృష్టి దోషమేగానీ సృష్టిలో దోషము ఏమాత్రము లేదు. దృష్టిలో ఉంది దోషము. ఎలాంటి కలరు అద్దమో అలాంటి కలరుగా కనిపిస్తుంది. ద్వేషముతో చూడు, ద్వేషముగానే కనిపిస్తుంది. ప్రేమతో చూడు, ప్రేమగానే కనిపిస్తుంది. "యద్భావం తద్భవతి." మన భావములే మనకా విధంగా కనిపిస్తాయి. అందరూ భగవత్స్వరూపులే. ఆ విధమైన ఏకాత్మ భావము పెంచుకోవాలి. ఈ ప్రేమయందున్న శక్తి దేనియందును లేదు. ఒక్క ప్రేమచేత ఎంతైనా సాధించవచ్చు. ఇంతమంది ఇక్కడ ప్రవేశించారు. దీనికి ఏమి కారణము? ఒక్క ప్రేమయే మూలకారణము. మీ అందరికీ స్వామిపైనున్న ప్రేమ, స్వామికి మీపైనున్న ప్రేమయే ఇంతమందిని ఇక్కడ ప్రవేశపెట్టింది. లేకపోతే మీకు ఎవరు ఆహ్వానం పంపారు? లేదే. ఈ ప్రేమయే అన్నింటిని కట్టివేస్తున్నది. ప్రేమను పెంచుకోండి. ప్రేమతో సంభాషించండి. ప్రేమతో పనులు చేయండి. ప్రేమనే చింతించండి. ప్రేమతోనే సర్వకర్మలు ఆచరించండి. ఇంతకంటె సులభమైన మార్గము మరొకటి లేదు. జపమాల పట్టుకు తిప్పుతుంటే జపము చేస్తున్నాను అని అనుకుంటావు. చేతిలో జపమాల, మనసులో చాకలి ఇల్లు, మంగలి ఇల్లుపై ధ్యాస!

ధ్యానములో కూర్చుంటే వంటింట్లో మాడిన కూరల వాసన వస్తుంది; బుద్ధి బయటకు పోతుంది. ఇదే మనము చేసే ధ్యానము. ఇదే మనము చేసే జపము. జపమనగా ఏమిటి? "భగవంతుడు నాలో ఉంటున్నాడు. నేనే భగవంతుడను." ఇదే నిజమైన జపము. ధ్యానము ఏమిటి? 'అహం బ్రహ్మాస్మి.' ఇంతకంటె సులభమైన మార్గము ఏ వేదమూ బోధించలేదే! అన్ని వేదములూ 'అహం బ్రహ్మాస్మి', 'తత్త్వమసి', 'ప్రజ్ఞానం బ్రహ్మ', 'నేను నీవే, నీవు నేనే' అంటున్నాయి. ఆ పదములలోనే కన్పిస్తున్నది మనకు సత్యము. కానీ ఈ పదములను పండితులు అటు తిప్పి ఇటు తిప్పి మనకు ఉన్న విశ్వాసము పోగొడుతున్నారు. Confusion కి మీరు చోటివ్వకండి. కసరత్తుచేత మీ మనసును పాడుచేసుకోకండి. సులభమైన, సున్నితమైన మార్గము, అతిమధురమైన మార్గము, అతి ఆనందమయమైన మార్గము ప్రేమ ఒక్కటే, ఒక్కటే, ఒక్కటే.

1996 జూలై 6వ తేది సాయికుల్వంత్‌హాల్‌లో భగవాన్ దివ్యోపన్యాసం

sri sathyasai vachanamrutam